# ఇల్లుతల్లి

ఆ ఇల్లు ఇక్ష్వాకుల కాలం నాటిదని ఆ ఊళ్లో అందరూ హాస్యంగా చెప్పుకొంటారు. చూస్తే, మీరూ ఆ మాటే అంటారు. సందేహం లేదు. ఎందుకంటే, ఆ ఇల్లు కట్టి నప్పుడు ఎలా ఉండేదో, ఇప్పటికీ అలాగే ఉంది.

ఆ ఇంట్లో ఎన్నితరాలు గడిచిపోయాయో గోడలకు తగిలించి ఉన్న పాత ఫొటోలు చెబుతాయి. ఆ కాలం నాటి వేషాలతో చూట్టానికి వింతగా, ఆసక్తిగా ఆ ఫొటోల్లోని మనుషులు దర్శనమిస్తారు. టోపీలు, కోట్లు అడంబరానికి వేసుకున్నా వాళ్ల నవ్వు మొహాల్లో నిర్మలత్వం ఆకట్టుకుంటుంది.

ఆ ఇల్లు ప్రస్తుత యజమాని నా బాల్యమిత్రుడు రాజా.

నిజానికది వాడికి మిత్రబృందం పెట్టిన ముద్దుపేరు.

అసలు పేరు రామ్మోహన్.

ఇక్కడో విషయం చెప్పాలి. 'పుంసా మోహన రూపాయ' అనేది శ్రీరాముడి రూపలక్షణం. అంటే ఆయన అందం మగవారిని కూడా సమ్మోహనపరచి కట్టిపడేస్తుందని అర్థం. శ్రీరాముణ్ని సంపూర్ణంగా ఎవరూ చూడలేక పోయేవారట. కారణం ఆ అందాల రాముడి ఏ అవయవం చూస్తే చూపులు అక్కడే ఆగిపోయేవట. కన్నులు కమలదళాలు. మోము చంద్రబింబం. అందం నిర్వచించాలంటే రాముడి రూపవర్ణన చేస్తే చాలంటారు.

రాముడంతటి భువన మోహనుడు.

మా రామ్మోహన్ నిస్సందేహంగా అందగాడు. అందాల తెలుగునటుడి పోలికలు అతనిలో కనిపిస్తాయి. ఈ మాట అనటానికి నేను నేర్చుకున్న సాపేక్ష సిద్ధాంతమే కారణం. మన వాళ్ళు గొప్పవాటికి సినిమా నటులతో పోలికలు పెట్టడం పరిపాటి కదా?

అదలా ఉంచితే, రాజాలో ఉన్న కొన్ని ప్రత్యేకతల గురించి మీకు చెప్పాలి. మనిషి ఫిల్టర్ కాఫీలాంటి వాడు. కల్మషాలేమీ లేని స్వచ్ఛమైన మనసు. ఒక్క పరిచయంతో జీవితకాలం అనుబంధం ఏర్పడగల వ్యవహారశైలి.

అందరితో ఆత్మీయంగా ఉంటాడు. ఎవరి గురించీ ఒక్క చెడ్డమాటైనా చెప్పడు. ఇతరుల గురించి తనవద్ద అదే పనిగా విమర్శిస్తుంటే తమాషాగా స్పందిస్తాడు. మొదట మౌనమందహాస వదనంతో వింటున్నట్టు కనిపిస్తాడు. కానీ వినడని నాకు తరవాత అర్ధమయింది. అవతలివ్యక్తి అలాగే కొనసాగిస్తుంటే మాట మార్చటానికి ప్రయత్నిస్తాడు. అదీ పని చెయ్యకపోతే, "వదిలెయ్యండి సార్! ఈ ప్రపంచంలో ఎవరు శుద్ధమైన వాళ్లు? అందరికీ లోపాలుంటాయి. సాయిబాబా అన్నట్టు ఎదుటివాడి దోషాల్ని మన నాలుకతో శుభ్రం చెయ్యటం దేనికి?" అంటాడు. ఈ దెబ్బతో అవతలివాడు నోర్మూసుకు తీరాల్సిందే.

'స్వార్థం తమ జన్మహక్కు'గా భావించటం సమాజ లక్షణం. రాజాలో నేను చూడలేకపోయిన లక్షణం స్వార్థం. అతనికి శాంతి మంత్రాలేవీ తెలియవు. కానీ 'సర్వేజనా స్సుఖినోభవంతు' ధోరణి చాలా స్పష్టంగా కనిపిస్తుంది. అతని జూనియర్‌కి ముందుగా ప్రమోషన్ వచ్చినప్పుడు మనస్ఫూర్తిగా అభినందించటం చూసి, జూనియర్ దిమ్మెర పోయాడు. కొలీగ్స్ ఎంత ప్రోద్బలం చేసినా తన హక్కు కోసం ఎలాంటి పోరాటమూ చెయ్యలేదు!

అతను మనిషిలో రుషి అని చాలామంది ఆశ్చర్యపోయారు. ఆటుపోట్లకి ఎలాంటి వాడయినా చలిస్తాడు. కానీ, రాజా ఆనందంలో మందహాసం చేస్తాడు. గొప్ప విషాదంలో నిర్లిప్తంగా ఉండిపోతాడు. అదీ రాజా ప్రత్యేకత.

అతనికి తల్లి అంటే పంచప్రాణాలు.

ఆర్థిక బాధల్ని అవతలపెట్టి, ఆవిడకి ఎలాంటి లోపమూ కలగకుండా కంటికి రెప్పలా చివరి క్షణం దాకా చూసుకున్నాడు. ఆవిడ చివరి క్షణాల్లో ఉందని తెలిసినా, ఇంట్లోంచి బయటకు జేరవెయ్యలేదు. అలాగే ఆమె చేతిని తన చేతిలో ఇముడ్చుకుని, మౌనంగా ఉండిపోయాడు.

ఆవిడ కొడుకుని చూస్తూ శరీరత్యాగం చేసింది.

కళ్లల్లోంచి ప్రాణం పోయింది.

మర్నాడు, ఆవిడకి అంతిమ సంస్కారాలు ముగించాక, అతని మొహంలో నూరేళ్ల దుఃఖం వివిధ ఛాయల్లో కదలాడింది. అలాగే మింగేశాడు, హాలాహలాన్ని శివుడిలా.

"తల్లి పోతే ఏడవాలనిపించటం లేదట్రా!!" నా ప్రశ్నకి నిర్వేదంగా చూశాడు.

"మా అమ్మ ఎక్కడికీ పోలేదురా. ఈ ఇల్లే మా అమ్మ, ఇవాల్టినుంచీ ఈ ఇంటి పేరు తల్లి" అన్నాడు.

అన్నట్టుగానే ఇంటి మీద 'తల్లి' అని రాయించాడు.

'మాతృశ్రీ' అనో ఇంకా అలాంటి అందమైన మరో పేరో పెట్టమని కొందరు ఉచిత సలహాలిచ్చారు. రాజా వాటిని పట్టించుకోలేదు. ఇంట్లోకి వస్తూ గుమ్మాన్ని కళ్ళకద్దుకుంటాడు. ఇంట్లోంచి బయటకు వెళ్తూ ఇంటికి నమస్కరిస్తాడు.

చూసేవాళ్లకి వింతగాను, అదో చాదస్తంగాను అనిపించేది.

కానీ, ఏమీ పట్టించుకోకపోవటం, తాను అనుకున్నది చెయ్యటం రాజా ప్రత్యేకత.

ఇంతవరకు నేను చెప్పింది పదేళ్ల క్రితం కథ.

అప్పట్లో ఊరు అంతగా పెరగలేదు.

ఇప్పుడు ఊరు ఒళ్లు విరుచుకున్నట్టు విస్తరించింది.

నేల ధరలకు రెక్కలు వచ్చాయి. బంగారు పంటల సంగతి ఎలా ఉన్నా, రియల్ ఎస్టేట్ పుణ్యమా అని భూములు బంగారు కాసులు కురిపిస్తున్నాయి.

రాజా ఇల్లు ఇప్పటికీ ఇక్ష్వాకుల కాలం నాటిదిగానే ఉందా?

అసలు ఇల్లు ఉంచాడా?

పెరిగిన ధరలకి ఆశపడి అమ్మేశాడా?

కాస్తా కూస్తా కాదు. ఆరొందల గజాలు... అపార్టుమెంటు వ్యాపారులు వెంటపడకుండా ఉండరు.

గంట నుంచీ వెతుకుతున్నాను.

సిటీలో సరిగ్గా చిరునామా తెలియకపోతే, సముద్రంలో సూది వెతుక్కున్నట్లే, ఓపిగ్గా తిరుగుతూనే ఉన్నాను.

సూర్యుడు నా ఓపికను పరీక్షిస్తున్నాడు.

దాహం తట్టుకోలేక సోడాబడ్డీ దగ్గరకెళ్లాను. అదృష్టం బావుండి ఐస్ సోడా దొరికింది. సోడా గొంతు దిగాక దాహం పారిపోయింది. ప్రాణం తేరుకుంది.

అప్పుడే అక్కడికి ఒక వ్యక్తి మనవడితో వచ్చి బిస్కెట్ ప్యాకెట్ కొని చిల్లర ఇస్తుంటే యథాలాపంగా చూసి ఉలిక్కిపడ్డాను.

అతనిలో రాజా పోలికలు కనిపించాయి.

కాకపోతే, బట్టతల! వార్ధక్య ఛాయలు...

కుతూహలం ఆపుకోలేక "మీరు రాజానా?" అనడిగాను.

"అవును" అన్నాడు నన్ను గుర్తు పట్టటానికి ప్రయత్నిస్తూ.

నాకు కొండంత సంతోషం కలిగింది. విజయం లభించినట్లు మందహాసం చేశాను.

"మీరు..." అంటూ ఆగిపోయాడు.

నేను పకపక నవ్వేశాను.

"నువ్వు...నరేంద్రవా?"

"ఇంకా సందేహమా??"

వెంటనే గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు.

'ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి....' గొంతు గద్గదంగా పలికింది. అదే సిసలైన ప్రేమకు అసలైన గుర్తు.

ఇద్దరం కొద్ది క్షణాలు పారవశ్యాన్ని అనుభవించాం. అయిదేళ్ల మనవడు ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"వీడి పేరేమిట్రా?"

"వంశ వర్ధన్"

"మొత్తానికి నీ ప్రత్యేకతలు అలాగే నిలబెట్టు కుంటున్నావ్!" ప్రశంసగా అన్నాను. మందహాసం చేశాడు.

"పద ఇంటికి వెళదాం" హత్తుకున్నట్లుగా భుజం మీద చెయ్యివేసి ఇంటికి దారి తీశాడు. దారంతా కబుర్లే...

పదేళ్ల విరామంలో జరిగినవన్నీ గబగబ చెప్పేసుకున్నాం.

అంతలో ఇల్లు రానే వచ్చింది.

ఇంటి మీద అక్షరాలు అలాగే ఉన్నాయి.

'తల్లి'- రాజా గుమ్మాన్ని కళ్లకద్దుకుని, లోపలికి దారి తీశాడు.

"తాతా! ఇదుగో ఫలహారం..." రాజా మనవడు ప్లేటులో అట్లు తీసుకొచ్చాడు. అవి చల్ల అట్లు. నంజుకోవటానికి ఉల్లిపాయ కారం. అవంటే నాకూ, రాజాకి మహాఇష్టం. వాడికి ఇవన్నీ గుర్తున్నాయన్న మాట!

ప్లేటు అందుకుని "మీ తాత ఏం చేస్తున్నాడు?" అనడిగాను.

"పూజ చేసుకుంటున్నారు..." మాటలే కాదు పిల్లాడు కూడా ముద్దుగా ఉన్నాడు.

" మీ డాడీ ఏం చేస్తారు?"

"డాడీ కాదు-నాన్న"

హవాయి చెప్పుతో చెంపమీద కొట్టినట్టనిపించింది.

సిగ్గుపడుతు "మీ నాన్న ఏం చేస్తాడు?" అడిగాను.

"బ్యాంకులో మేనేజరు"

"మీ మమ్మీ... సారీ మీ అమ్మ?" ఈ మాటు జాగ్రత్త పడ్డాను.

"మా అమ్మ స్కూల్లో టీచరు"

"చాలా సంతోషం. మరి నువ్వు టిఫిను తినవా?"

"ముందు పెద్దవాళ్లు తినాలి. తరవాత చిన్నవాళ్లు"

"నువ్వేం చదువుతున్నావ్?"

"ఒకటో క్లాసు..."

"నీకు పద్యాలు వచ్చా?"

"ఓ..." అంటూ చకచక భక్త ప్రహ్లాదుడి పద్యాలు వినిపించేశాడు. "నాకు గీతా శ్లోకాలు కూడా వచ్చు..." అంటూ అవి వినిపించాడు.

నేను తినటం మరిచిపోయి తెల్లబోయి వింటుండగా రాజా నవ్వుతూ వచ్చాడు.

"ఏమిటీ... మా మనవడు నిన్ను అదరగొడుతున్నాడా?" అనడిగాడు.

"అబ్బో... వీడు నిన్ను మించిపోతాడురా..." ప్రశంసగా అన్నాను.

"అందరూ ఈ మాటే అంటుంటారు. అదేమిటి? అట్లు చల్లారిపోతుంటే తినవేం? అవి వేడిమీదనే బావుంటాయి" అన్నాడు.

"మరి నీకో?"

"వస్తున్నాయిలే. నువ్వు తింటూండు" అంటు ఎదురు కుర్చీలో కూర్చున్నాడు.

వంశ వర్ధనుడు వాళ్ల తాతక్కూడా చల్ల అట్లు తెచ్చాడు.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ తిన్నాం.

"ఒకసారి మీ ఇల్లంతా చూడాలిరా"

"రా చూద్దువుగానీ..." లోపలికి దారి తీశాడు. ఏ గదిలో చూసినా నలిగిపోని, చెరిగిపోని వారసత్వం, గొప్ప కళా దర్శకుడు వేసిన సెట్టింగులా సహజంగా ఉంది.

ఇంట్లో ఒక అనిర్వచనీయమైన ప్రశాంత వాతావరణం ఉంది. ఆ తలుపులు, కిటికీలు, గోడలు, పాతబడిన ఫొటోలు- అన్నీ ఆప్యాయంగా మాట్లాడుతున్నాయి. గతం గురించి అంత గొప్పగా ఎవరు చెప్పగలరు?

దొడ్లోకి తీసుకెళ్లాడు.

ఉసిరి, మామిడి, జామ, బొప్పాయి చెట్లు పాత చుట్టాల్లా పలకరింపుగా కొమ్మలు కదిలించాయి.

అన్నిరకాల పూలమొక్కలూ ఆనందగీతాలూ పాడుతూ, సుగంధ గంధాన్ని వెదజల్లుతున్నాయి.

ఆశ్చర్యం!

పిచ్చుకలు కనిపించాయి. అవి కిచకిచలాడుతుంటే అద్భుతం అనిపించింది. రకరకాల పిట్టలు కేరింతలు కొడుతూ, గెంతులు పెడుతూ కనువిందు చేస్తున్నాయి..!

రాజా వాటికి గింజలు జల్లుతుంటే, అవి సంబరంగా అతని భుజం మీద వాలుతున్నాయి.

ఆహా! ఇది ఆశ్రమంలా ఉంది. ఎడారిలో ఒయాసిస్సులాగా, నగరంలో ఇలాంటి ఇల్లు, ఈ ఇంటి తోట... ఎంత అద్భుతం!

కాసేపు పిట్టలతో కాలక్షేపం చేసి, మామిడిచెట్టు నీడకు తీసుకెళ్లాడు రాజా. అక్కడ నులకమంచం ఉంది. ఇద్దరం కూర్చున్నాం.

"నీ ఇల్లు, ఇంటి చుట్టూ తోట ఆశ్రమం లాగా ఉన్నాయి" అన్నాను.

"అందరికీ ఇవి నచ్చవురా. దీన్ని అమ్మేసి, వచ్చే డబ్బులతో బ్యాంకులో డిపాజిట్ చేసి, వడ్డీ డబ్బులతో దర్జాగా బతకొచ్చని నా బావమరిది సలహా... అపార్టుమెంట్ల వాళ్లయితే వారం వారం వచ్చి బతిమలాడుతుంటారు. మీకు మూడు ఫ్లాట్లు ఇస్తాం సార్, స్థలం మాకు ఇవ్వండని గోల. నేను అపార్టుమెంటులో ఉండలేను. అపార్టుమెంటులో ఉన్న మిత్రుల్ని చూట్టానికి వెళ్లినా నాకు అయోమయంగా ఉంటుంది. గాలి ఆడదు. ఎప్పుడు బయటకు వద్దామా అని ఆరాటపడిపోతాను..."

"నిజమే! అపార్టుమెంటులో అందరూ ఉండలేరు. గత్యంతరం లేక ఉండటమే. ఈ ఇల్లు ఇప్పటిలాగానే ఉంచు, ఇలాంటి వాతావరణం కల్పించటం మళ్లీ మన వల్లకాదు. ప్రపంచం మారిపోతున్నా మౌనిలా, మహర్షిలా, సమాధిలో ఉన్నట్టు అలాగే ఉందిరా మీ ఇల్లు! ఈ వాతావరణం నన్ను కట్టి పడేస్తోంది..."

"ఈ ఇల్లు నాకు తల్లిరా. ఈ ఇంటి అణువణువులో మా అమ్మ పాద ముద్రలున్నాయి. ఆమె తన అమృతహస్తాలతో నాకు తినిపించిన గోరు ముద్దల జ్ఞాపకాలున్నాయి. చిన్నతనంలో నాకు సుస్తీ చేసినప్పుడు అమ్మ ఒడిలో పడుకునేవాడిని... అమ్మ ఆప్యాయంగా, ఆర్తిగా నా ఒళ్లంతా నిమిరేది. మంత్రం వేసినట్టు అనారోగ్యం మటుమాయం అయ్యేది. ఇప్పటికీ అదే జరుగుతోందిరా. అమ్మ చివరి క్షణాలు గడిపిన చోటే నేను పడుకుంటాను. అమ్మఒడిలో పడుకున్నట్లే ఉంటుంది. అమె అమృతహస్త స్పర్శ నాకు అనుభవమవుతుంటుంది" రాజా గొంతు గద్గదమైంది.

నాలో అంతర్మథనం ఆరంభమైంది.

ఇల్లు ఎవరికైనా తల్లిలాంటిది కాదా?

ఎందరు ఈ దృష్టితో చూస్తున్నారు? ఎవరి విషయమో దేనికి? నేను అలా చూస్తున్నానా? బయటి చీకాకులన్నీ మనసులో మోసుకొస్తూ ఇంటావిణ్ని విసుక్కోవటం, కసురుకోవటం చేసేవాడిని. మా ఆవిడ సహనానికి మారు పేరు గనుక గృహశాంతికి భంగం కలిగేది కాదు.

మా పక్కింటాయన నిండుగా తాగి మెండుగా అల్లరి చేసేవాడు.

పెళ్లాన్ని బెల్టుతో చావగొట్టేవాడు. తట్టుకోలేక పుట్టింటికెళ్లిపోయింది. ఇప్పుడా ఇల్లు ఒక అనాథగృహం. ఒక్కడే కూర్చుని ఏడుస్తుంటాడు. లేకపోతే, వెళ్లిపోయిన పెళ్లాన్ని బండబూతులు తిడతాడు.

ఇంటిని తల్లిగా చూసే రాజాకున్న ఆత్మీయదృష్టి ఉంటే, ఎవరికైనా గృహం స్వర్గసీమే, ఇల్లాలు దేవతే. అప్పుడు కలతలూ, కన్నీళ్లూ ఉండవు. కలిమికీ లేమికీ తేడా కనిపించదు. ప్రేమ విరిసిన చోట పగలైనా వెన్నెలే. ఈ సత్యం ప్రపంచానికి చాటాలనిపించింది. నవ్వుకున్నాను. ఇలాంటివన్నీ మన శాస్త్ర నిర్మాతలు ఏనాడో చెప్పారు.

వేదమంత్రాలు అర్థం చేసుకుంటే- ఇవే సందేశాలు వినిపిస్తాయి. కానీ, అంతటిశ్రద్ధ ఎవరికుంది? పరుగుల జీవితాలు. మంచి ఆలోచనలు రావు. ముందుగా మార్పు నాలో కలగాలి. నా ఇంటిని నేను ప్రేమించాలి. ఇంటిలో ఉండే తల్లి ఆత్మను గుర్తించాలి. ఆ తల్లి ఒడిలో ఒదిగిపోవాలి. అప్పుడది దేవాలయమే.

ఇలా అనుకున్నాక, త్వర్గా ఇంటికి వెళ్లాలనిపించింది. వీడ్కోలు చెప్పి బయలుదేరాను. ఇల్లు దాటి బయటికొచ్చాక. ఆ ఇంటికి భక్తిగా నమస్కరించాను. నాకు జ్ఞానోదయం కలిగించిన ఇల్లు తల్లి!

తల్లి ఎవరికైనా తల్లే!

నా అడుగులు వేగంగా నా ఇల్లు తల్లివైపు దారి తీశాయి.

(నవ్య వీక్లీ కథలపోటీలో బహుమతి పొందిన రచన)